
# కాన్వెంట్ జంగిల్

సలీం




**రఘురాంకి రెండ్రోజుల్నుంచీ నిద్రపట్టటం లేదు - అన్నం సహించటం లేదు - బాసాసురుడు బూతులు తిడ్తాడని తెల్సినా పని చేయాలనిపించటం లేదు - బుజ్జిగాడికి రెండేళ్ళు నిండాయి మరి. వాణ్ణి ఓ మంచి స్కూల్లో నర్సరీలో చేర్పిస్తే గాని అతనికి మనశ్శాంతి ఉండదు.**

తన ఆఫీసులో పనిచేసే కొంత మందిని వాకబు చేశాడు - నగరంలోని ది బెస్ట్ స్కూల్ ఏదని. ''బెస్ట్ కావాలా గుడ్, బెటర్‌లు సరిపోవా'' అని అడిగిన దానికి గిజగిజలాడిపోయి, ''ఉన్నది ఒక్కడే కొడుకు - మనం తడికల స్కూళ్లో, తెలుగు మీడియంలో మిడి మిడి చదువులేవో వెలగబెట్టాం - వాడికైనా మంచి చదువు గొప్ప స్కూళ్లో చెప్పించాలని కోరిక'' అన్నాడు.

''అయితే సూపర్‌నోవా స్కూలే అన్నిటికి మిన్న'' అని అందరూ ఏకకంఠంతో పలుకగా సంతసించి అప్లికేషన్ ఫాంకోసం పరుగెత్తాడు.

అప్లికేషన్ దాఖలు చేసినప్పటి నుండీ అతనికి గుండె దడగానే ఉంది. సూపర్‌నోవా స్కూళ్లో అందరూ అయ్యేయస్, ఐపిఎస్ ఆఫీసర్ల కొడుకులూ, సూపర్ బిజినెస్‌మెన్‌ల పిల్లలూ, రాజకీయ నాయకుల సంతానం - అంతే. తనలాంటి మధ్య తరగతి వాళ్ళ

పిల్లలు దుర్భిణీ పెట్టి వెదికినా దొరకరు గాక దొరకరు. అందుకే మరలా అతనికి నిద్రపట్టటం లేదు. ఓ మూడ్రోజులు నిద్రలేమితో పక్కమీద అటూ ఇటూ



## కరిష్మా లేకున్నా నాకుంది చరిష్మా

ఈ మధ్య 'రాణీ నా బాణీ' అంటున్న గోవిందా, ''కరిష్మా నాతో నటించకపోతే నాకేంటి? నాతో 'సై' అంటే నటించేందుకు బోల్డుమంది లైన్లో నిలబడతారు'' అంటున్నాడు యమ అక్కసుగా! ఇంతకీ సంగతేంటబ్బా? అని ఆరాతీస్తే తెలిసిందేమిటంటే, 'గోవిందాతో ఏడాదికో సిన్మా కంటే చెయ్యనంది'ట కరిష్మా కపూర్. ''లోలో (కరిష్మా ముద్దు పేరు)కి ఆశా, ఆశయమూ – రెండూ ఎక్కువే! నాతో నటించకపోవడమనేది ఆమె పర్సనల్ విషయం. నేనుమాత్రం తనకెప్పుడూ అంతా మంచి జరగాలనే కోరుకుంటా. అయినా, నేను ఓకే అంటే బోల్డుమంది రెడీగా ఉన్నారు. ఒకటి మాత్రం నిజం. నేనూ, కరిష్మా నటిస్తే జరిగేది మ్యాజిక్కే! చూస్తూండండి! మేమిద్దరం మళ్ళీ నటిస్తాం'' అంటున్నాడు 'చీచీ' గోవిందా!

పడ్డాక ఇక లాభం లేదని తన ఆఫీసులోని సలహాల్రావుని శరణుజొచ్చాడు.

సలహాల్రావు అసలు పేరు సుబ్బారావు. అతనికి ఆఫీసు పని మీదకన్నా ఆఫీసు కాంపౌండ్ బైటి విషయాల మీదే మక్కువ ఎక్కువ – అందువల్ల విషయ పరిజ్ఞానమూ ఎక్కువే. అతను బైటి పనులు చేయడు – చేయించి పెట్టడు. కానీ ఎవర్ని కలుసుకుంటే పనులవుతాయో – సుమారుగా ఎంత ఖర్చు అవుతుందో ఖచ్చితంగా చెప్పగలడు – అలా ఎవరెవరికి పనులు సానుకూలంగా జరిగాయో వాళ్ళ వివరాలు పొల్లుపోకుండా చెప్పగలడు. సలహా తీసుకోవడం కోసం పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. కాబట్టి అతని చుట్టూతా ఎప్పుడూ పది మందికి తక్కువ కాకుండా మనుషులు గుమిగూడి ఉంటారు.

బల్కంపేటలో బాబూరావనే శాల్తీ ఉందనీ – చూట్టానికి చిరుగాలికి ఎగిరిపోయే అర్భకపు ప్రాణిలా కన్పించినా ఇటువంటి వ్యవహారాల్లో ఉద్దండపిండమనీ – అతనికి విద్యాశాఖామాత్యుల పర్సనల్ అసిస్టెంట్ గారు చాలా పర్సనల్‌గా తెలుసుననీ – మినిష్టరు గారి రికమండేషన్‌తో మినిట్స్‌లో పనులు జరిగిపోతాయని సలహాల్రావు శెలవిచ్చాడు.

''సుమారుగా ఎంత ఖర్చవుతుందంటావూ'' రఘురాం బెదుర్తూనే నసిగాడు.

''ఖర్చుకి బెంబేలెత్తే వాడివి తగుదునమ్మా అంటూ సూపర్‌నోవా స్కూల్ గురించి ఎందుకు వాకబు చేశావు బాబూ – నా ప్రెషస్ సలహాని నేలపాలు చేద్దామనే దురుద్దేశంతోనే కదా – మీ ఇంటి పక్కనే ఉన్న గోవిందా గోవిందా స్కూల్లోనే చేర్పించలేకపోయావా – అదైతే నీలాంటి కంజూస్ గాళ్ళకి సరిపోతుంది.''

ఆ మాటలకు రఘురాంకి రోషం రొయ్యి మీసంలా బారెడైపోయింది.

''అంటే నీ ఉద్దేశంలో నేను నా కొడుకుని గోవిందా గోవిందాలాంటి నీచ దరిద్రపు స్కూల్లో మాత్రమే చేర్పించే బేవార్సుగాడిలా కన్పిస్తున్నానా – ఎంత ఖర్చవుతుందో చెప్పు – లక్షనా రెండు లక్షలా'' అన్నాడు దర్పంగా.

''పాతిక వేలు'' అన్నాడు సలహాల్రావు. మహా అయితే అయిదో పదో అనుకుంటున్న రఘురాం దీనంగా చూశాడు – పాతిక వేలే – బాబోయ్ – లాభం లేదు – తన తాహతుకి మించిన వ్యవహారం అనుకున్నాడు. కానీ వెంటనే అతనికి తన ప్రిస్టేజ్ మూసీ మురికిలో పొర్లాడుతూ కనిపించింది. పాతిక లక్షలయినా లక్షా పాతిక అయినా ఆ స్కూల్లో సీటు సంపాయించాల్సిందేనని బలంగా నిర్ణయించుకుని బాబూరావుని వెతుక్కుంటూ బయల్దేరాడు.

బల్కంపేటలో బాబూరావు ఇల్లయితే దొరికింది కానీ సదరు శాల్తీ మాత్రం రెండ్రోజులు గాలించినా దొరకలేదు. ఇహ లాభం లేదనుకుని మూడో రోజు రాత్రి పది దాటినా వాళ్ళింటి ఎదురుగా బీట్ వేశాడు. పదకొండు దాటాక – దేశంలోని బీట్ కానిస్టేబుళ్ళ మీద జాలిపడిపోతూ తన స్థితికి తనే కుంగిపోతున్న తరుణంలో ఆర్తత్రాణ పరాయణుడిలా బాబూరావు దర్శనమిచ్చాడు.

విషయం విన్నవించుకుని విషాదాంత నాటకంలోని చివరి సీనులో పాత్రధారిలా నిలబడ్డ రఘురాం వైపు చూసి హస్కీగా విస్కీ నవ్వు నవ్వాడు బాబూరావు. ''ఓస్ గింతేనా'' అన్నాడు పాన్ తుంపర్లు ఉదారంగా వెదజల్లేస్తూ. ఓ యాభై కొట్టించి వారం ఆగివస్తే అడ్మిషన్ కాగితం చేతిలో పెడ్తానన్నాడు. ''యాభై కాదు ఇరవై'' అన్నాడు రఘురాం. ''చివరాఖరి బేరం ముప్పయ్'' అన్నాడు చికెన్ బిర్యానీ త్రేన్పుతో ముక్తాయిస్తూ బాబూరావ్. ఫైనల్‌గా పాతిక ప్లస్ మందు పార్టీ దగ్గిర బేరం సెటిల్ అయింది. మొదట పదిహేనూ పని అయ్యాక మిగతా పదీ అన్నాడు రఘురాం ముందు జాగ్రత్తగా. ''గదంతా జాన్తానై – ముందు గాల్ల మొత్తం పైసలు దీస్కరా'' అన్నాడు బాబూరావ్ కరడుగట్టిన ప్రొఫెషనల్ ఫక్కీలో – ఉదయం ఆరింటికి ముహూర్తం నిర్ణయించుకుని ఇంటికొచ్చాక పాతిక వేల కోసం ఏది తాకట్టు పెడితే బావుంటుందో ఆలోచిస్తూ రాత్రంతా గడిపాడు రఘురాం.

ఉదయం కాగానే భార్యను బ్రతిమాలుకుని రెండు జతల బంగారు గాజులు, రెండు గొలుసులు, ఒక చంద్రహారం తీసుకుని మార్వాడీ కొట్టుకు వెళ్ళి అట్నుంచి నేరుగా బాబూరావింటికి వెళ్ళాడు.

''గింతాలస్యమైందేం – పరేషాన్ అయ్యినా – ఆఫీసులల్ల నా పనులన్నీ గాబట్టాలా వద్దా – పని లేని బేకార్ గాడిలా కన్పడ్తున్నానా? నాతాన అంత ఫుర్సత్ లేదు'' బాబూరావు చిటపటలాడాడు. ''ముందుగల్ల చెప్తున్నా – గిందులో నా కమిషను ఐదు మాత్రమే – మిగతా ఇరవై మినిష్టరు గారి పియ్యే పొన్నుసామి చేతిలో పోస్తా. నీ పని అతడే జేసిపెడ్తడు. గాతర్వాత నాది జిమ్మేదారి గాదు'' అన్నాడు.

''సీటు గ్యారంటీనేగా'' డబ్బులు అతని చేతికిస్తూ అన్నాడు రఘురాం.

గుర్రుగా చూశాడు బాబూరావ్. ''నా పదేళ్ళ సర్వీసులో శానా మందికి సీట్లిప్పించినా – సమఝైందా – గిప్పుడే నిన్ను మినిష్టరుతానికి తోలుకెల్తా లెగు'' అన్నాడు బైటికి కదుల్తూ. అతని వెనుక గంగిరెద్దులా రఘురాం...

వీళ్ళు సెక్రటేరియెట్ వెళ్ళేప్పటికి సదరు పొన్నుసామి కల్లు తాగిన కోతిలా వీరంగం చేస్తున్నాడు. రేపట్నుంచి మినిస్టరు గారి టూర్ ఉంది. ఆ లోపల అర్జంటుగా చూడాల్సిన బోల్డు ఫైళ్ళున్నాయి. అవన్నీ సక్రమంగా జరిగిపోయేట్లు చూడాల్సిన బరువూ – బాధ్యతా పొన్నుసామి మీదే ఉంది.

''ఏందప్పా బాబూరావ్ – ఈ టైంలో పూడిస్తివి – నేనుదా రొంబ బిజీగా ఉండానే'' అన్నాడతను.

''గితను రఘురాం – నా దోస్త్'' అన్నాడు బాబూరావ్ ఉపోద్ఘాతంలా. రఘురాం రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాడు. ''ఏందా పని – వేగిరం సొల్లు'' అన్నాడు పొన్నుసామి అసహనంగా. బాబూరావ్ విషయాన్ని క్లుప్తంగా వివరించి డబ్బున్న కవర్ని అతని చేతిలో పెట్టాడు.

''సూపర్‌నోవా స్కూల్ దానే అడ్మిషన్ – గ్యారంటీ అప్పా – మినిస్టరు మూడ్రోజుల క్యాంప్‌కి పూడుస్తుండ్రు. నాలుగో రోజు నీ పని అయిపోద్దప్పా'' అన్నాడు పొన్నుసామి కవర్ని జేబులోకి నెట్టేస్తూ.

''సీటు తప్పకుండా వస్తుంది కదా'' అని అడి

గాడు రఘురాం.

'అనుమానమే ఇల్ల - నీకుదా సీటు గ్యారంటీ-'

''సీటు నాక్కాదు - మా అబ్బాయికి'' అన్నాడు కంగారుగా రఘురాం.

''అబ్బా - తలకాయ తినకప్పా - పని ఎడికిదా - క్యాంటిన్‌దా కిట్టనే'' అన్నాడు విసుగ్గా.

ఇంకేదో మాట్లాడబోతున్న రఘురాంని జబ్బపట్టుకుని బైటికి లాక్కెళ్ళాడు బాబూరావ్.


''గిట్లా లొల్లిజేస్తే పోరగాడికి సీటురాదు. సప్పుడు జేయకుండ పన్లు జేస్కోపోవాల. గిప్పుడే సెప్తున్నా విను - నువ్వు జూస్తుండగానే పైసలు అతనికిచ్చినా. నాలుగో దినాం వచ్చి కల్వు. జట్న పనైతది'' అంటూ వేగంగా వెళ్ళిపోయాడు బాబూరావ్.

రఘురాం ఓ క్షణం తికమకపడ్డాడు. తేరుకుని చూసే లోపల బాబూరావ్ కన్పించలేదు. రెణ్ణిమిషాలు అచేతనంగా అక్కడే నిలబడ్డాడు. పొన్నుసామినే అడిగితే కొంతైనా నమ్మకం కలుగుతుందేమోనని మరలా లోపలికివెళ్ళాడు. ఇతన్ని చూసిన పొన్నుసామి మొహం చిట్లించి'' ఏందప్పా - మళ్ళా పూడిస్తివి'' అన్నాడు. రఘురాం కంగారుపడి ''అబ్బే-ఏం లేదు-వూర్కినే'' అంటూ బైటికొచ్చేశాడు.

మరో మూడ్రోజులు రఘురాంకి కంటిమీద కునుకులేదు. నాలుగో రోజు ఉదయమే బయల్దేరి సచివాలయానికి వెళ్ళాడు. పొన్నుసామి సీట్లో లేడు. తన డబ్బు తీసుకుని ఉడాయించాడేమో అని భయమేసిందో క్షణం. లక్షలూ, కోట్లు కాదుగా అని మనసుని సమాధాన పర్చుకున్న తన బ్రతుక్కి పాతిక వేలు అంతకన్నా తక్కువేం కాదని గుర్తొచ్చి భయంభయంగా ఓ గుమస్తాని అడిగాడు. ''ఈ వారం అంతా సెలవు - ఎల్‌టిసి మీద వైజాగ్ వెళ్ళారు'' అన్నాడతను రఘురాం వైపు అదోలా చూస్తూ. అతను తన వైపు జాలిగా చూస్తున్నట్లనిపించింది రఘురాంకి.

ఆటో మాట్లాడుకుని బాబూరావ్ ఇంటికి వెళ్ళాడు. అదృష్టం కొద్దీ అతను ఇంట్లో ఉన్నాడు. రఘురాం ఆదుర్దాగా పొన్నుసామి విషయం చెబితే ''గీ నడ్మ గిస్మంటి కేస్ తగల్లా - చల్ నా దిమాగ్ తింటున్నావ్ - పియ్యేగాణ్ణి కల్సినా - నీ ఎదురుగుండా పైసల్ ఇచ్చినా - ఇక్కడ గడ్‌బిడ్ జేస్తే ఏం లాబం? వాడి అంగీ గుంజి అడుగు. పన్లెలా గాబట్టుకోవాలో తెలీని నువ్వేం మడిసివి?'' అంటూ నిల్చోబెట్టి కడిగేశాడు. ఆ మాటలు తల్చుకుని తల్చుకుని, పొన్నుసామి రాకగురించి దిగులుపడి ఆవారం అంతా సరిగ్గా నిద్రపోలేదు రఘురాం.

వారం తర్వాత పొన్నుసామి సీట్లో కనిపిస్తే రఘురాంకి ప్రాణం లేచి వచ్చింది. ఇతన్ని చూసిన పొన్నుసామి అదో రకంగా నవ్వి ''నాన్ మినిస్టరు చెవిలో నీకుదాసీటు విషయం సొల్లినానప్పా - మొదటి లిస్ట్‌లో గ్యారంటీ- ఇక పో'' - అన్నాడు. రఘురాంకి గుండెల




పైనించి పెద్ద బరువు దింపేసినట్లయింది. తనని చూడగానే ''ఎవరప్పా నీవు?'' అననందుకు ఓ వైపు సంతోషం- సీటు గ్యారంటీ అన్నందుకు మరోవైపు సంతోషం ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా ఇంటికివెళ్ళాడు. ఆ సాయంత్రమే ఫస్ట్ లిస్ట్ పెడ్తారు. సాయంత్రం అయిదు కాకుండానే ట్రిమ్‌గా తయారయి స్కూల్‌కెళ్ళాడు. మొహంలో రిచ్‌నెస్, ప్రవర్తనలో హుందాతనం కన్పించేట్టు శతవిధాలా ప్రయత్నిస్తూ లిస్ట్ చూశాడు. తన కొడుకు పేరు లేదక్కడ. సరిగ్గా చూడలేదేమోనని మరలమరల చూశాడు. పేరు లేదు.

ఆ.రాత్రంతా రఘురాంకి నిద్రపట్టలేదు. బాబూరావ్, పొన్నుసామి కలిసి తనను దారుణంగా మోసం చేశారన్న బాధ - తన కొడుక్కి సీటు రాలేదన్న అవమానం - పాతిక వేలు పోయాయన్న దిగులు.

మరునాడు మండే గుండెతో, ఎఱ్రబడిన కళ్ళతో పొన్నుసామి దగ్గరకెళ్ళాడు. ''ఏందప్పా స్వీటు తేకుండా పూడిస్తివి'' అన్న పొన్నుసామిని చూసి వళ్ళు కూడా భగభగ మండి మాటల్ని ఈటెలుగా మార్చి మాట్లాడదామనుకునే లోపల, ''పిలకాయ పేరు లేదా? సెకండ్ లిస్ట్‌లో చూడు - ఉంటది- ఎర్రికైందా- వర్రీ కాకప్పా - సీటుదా గ్యారంటీ'' అన్నాడు తమలపాకుతో గారపట్టిన పళ్ళను చూపిస్తూ.

రఘురాంకి వేరే గత్యంతరంలేక మరో రెండుసార్లు అతనిచేత గ్యారంటీ అన్పించుకుని అట్నుంచి ఆఫీసుకెళ్ళిపోయాడు. మరో మూడ్రోజులు వూపిరి బిగబట్టి ఎదురు చూశాక సెకండ్ లిస్ట్ వేశారు. అందులోనూ అతని కొడుకు పేరు లేదు. లబోదిబోమనుకుంటూ పొన్నుసామి దగ్గరకు పరుగెత్తాడు. ఇతన్ని చూసిన పొన్నుసామి చిద్విలాసంగా నవ్వి ''ఏదో ప్రాబ్లం పూడ్చినదప్పా - మినిస్టరు గారు కూడా కోపం అయినారు సీటు ఇవ్వలేదని. థర్డ్ లిస్ట్‌లో గ్యారంటీ'' అన్నాడు.

సదరు థర్డ్ లిస్ట్ రావటానికి పది రోజులు పట్టింది. ఆ పది రోజులూ కలత నిద్రలోనే గడిపాడు రఘురాం. తీరా లిస్ట్ వచ్చాక చూస్తే పేరు లేదు. ఈసారి రఘురాం గొడవకి దిగాడు. పొన్నుసామి అతన్ని శాంతపరచి మినిస్టరు గారి క్యాండిడేట్లకోసం మరో స్పెషల్ లిస్ట్ ఉందని నచ్చచెప్పి పంపించాడు. రేపొస్తుందని, మరునాడొస్తుందని, రెండ్రోజులు ఆగాలని ఇలా రెండు వారాలు లాగించాడు. అప్పటికి మిగతా అన్ని స్కూళ్ళలో సీట్లు భర్తీ అయిపోయాయి. రఘురాంకి సహనం నశించి పిచ్చెక్కే లోపల ''నీ పని కాలేదు. సారీ అప్పా'' అంటూ పది వేలు చేతిలో పెట్టాడు పొన్నుసామి. మిగతా డబ్బుల గురించి అడిగితే, ''ఆ స్కూలు చుట్టూ పదిసార్లు తిరిగినందుకు దుడ్లు నీ అప్పా ఇస్తాడా'' అని ఎదురు తిరిగాడు.

రఘురాం చిన్నా చితకా అన్ని స్కూళ్ళకూ వెళ్ళి బ్రతిమాలుకున్నాడు ఓ సీటు ఇవ్వమని. ఖాళీలేదు పొమ్మన్నారు. రఘురాం ఎంత డబ్బయినా ఇస్తానన్నాడు. లాభం లేదుగాక లేదన్నారు. చివరాఖరికి తమ ఇంటి దగ్గరున్న గోవిందా గోవిందా స్కూలు యాజమాన్యం కాళ్ళు పట్టుకుని మామూలుకన్నా మూడింతల ఫీజుకట్టి సీటు సంపాయించాడు.

మొదట ఓ వారం రోజులూ అంత బేవార్సు స్కూల్లో చేర్పించాల్సి వచ్చినందుకు అవమానంగా ఫీల్ అయి నిద్రపోకున్నా, ఆ తర్వాత రఘురాంకి ఎప్పుడూ నిద్ర సమస్య కాలేదు. దానిక్కారణం స్కాపర్‌నోవా స్కూల్లోలా బండెడు హోం వర్కులూ, గంపెడు ఫీజులూ, గుండె చెరువయ్యేలా ఆర్భాటపు ఖర్చులూ గోవిందా గోవిందా స్కూల్లో లేకపోవటమే.